www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 23 | జనవరి | 2026 పేజీలు : 8

## యువతరంతోనే దేశాభివృద్ధి : కూనంనేని




# మున్సి'పోల్స్' సందడి..!




**-సమాయత్తమవుతున్న రాజకీయ పార్టీలు**
**-ఖమ్మంలో ఐదు, భద్రాద్రిలో కార్పొరేషన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలకు ఎన్నికలు**
**-మణుగూరు యథాతథం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలను మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నాయి. రెండు రోజుల్లో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలవుతుందన్న వార్తల నేపథ్యంలో రాజకీయ పార్టీలు డివిజన్ల వారీగా గెలుపు గుర్రాల కోసం వేట ప్రారంభించాయి. ఖమ్మం జిల్లాలో కొత్తగా ఏర్పడిన ఏదులాపురం, కల్లూరుతో పాటు వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు ఇల్లందు, కొత్తగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీకి ఎన్నికలు జరగనున్నాయి. రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితా అనంతరం వార్డుల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేయడంతో పాటు గెలిచే అభ్యర్థుల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో రాజకీయ పార్టీల మధ్య పొత్తుల చర్చలు కూడా ప్రారంభమయ్యాయి. పొత్తులు స్థానిక పరిస్థితులు బట్టి ఉండే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల మిగతా 2లో..

---

## భారత గడ్డపై
# సిపిఐది తిరుగులేని ప్రస్థానం




**ప్రజాపక్షం/కొత్తగూడెం :** భారతగడ్డపై సిపిఐది తిరుగులేని ప్రస్థానం అని, 1925లో దేశ స్వతంత్రాకంటే ముందే ఆవిర్భవించిన సిపిఐ అనేక త్యాగాలు, పోరాటాలతో మమేకమై ఉందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని మిగతా 2లో..

**- త్యాగాలు, పోరాటాలతో మమేకమైన ఏకైక పార్టీ**
**- మరో వందేళ్లు కూడా ప్రజల గుండెల్లో సుస్థిరం**
**- గౌతంపూర్‌లో శత వసంత పైలాన్ ఆవిష్కరించిన కూనంనేని**

# రాష్ట్ర సరిహద్దు దాటిన పెద్దపులి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలం కావడిగుడ్ల గుబ్బల మంగమ్మ ఆలయ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో పెద్దపులి పశువులపై దాడి చేసిన సంఘటన జరిగింది. ఆ ప్రాంతంలోని రైతులు ప్రజలు పెద్ద ఎత్తున దాడి చేస్తాదేమోనని భయంతో వణికిపోతూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని జీవనం సాగించారు. 19వ తేదీ రాత్రి కావడిగుడ్ల ప్రాంతంలో రెండు పశువులను బలి తీసుకుంది. ఈప్రాంతంలోనే ఉంటుందని ఆ ప్రాంత ప్రజలు పులి ఆనవాళ్లు కన్పించడంతో ఎక్కడ చూసినా అదే చర్చ కొనసాగింది. ఈ తరుణంలో రాష్ట్ర సరిహద్దు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం పందిరిమామిడిగూడెం సమీపంలో అటవీ ప్రాంతంలో పొలాల్లో కట్టేసి ఉన్న పశువులపై దాడి చేయటంతో పాటు గాడిదబోరు అంతర్వేదిగూడెం మీదుగా గోదావరి పరివాహక అడువుల గుండా



ముందుకు వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు ద్వారా చెప్తున్నారు. ఆ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# మున్సి‘పోల్స్’ సందడి..!




**(మొదటిపేజీ తరువాయి)**

ఇంచార్జిగా కొండా సురేఖను నియమించగా బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీకి ప్రత్యేకంగా ఎన్నికల ఇంచార్జీలను నియమించింది. ఇప్పటికే ఆశావాహులతో ఇంచార్జీలు చర్చలు జరుపుతున్నారు. అదే సమయంలో కలిసి వచ్చే పార్టీలతో అవగాహన వైపు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరగనుండడంతో రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. ఖమ్మంజిల్లాలో వామపక్షాల నిర్ణయం కూడా కీలకం కానుంది. దాదాపు అన్ని మున్సిపాలిటీల్లోనూ వామపక్షాలు గణనీయమైన బలాన్ని కలిగి ఉన్నాయి.

**కొత్తగూడెం కార్పోరేషన్‌పై సిపిఐ గురి : సాబీర్‌పాషా**

కొత్తగూడెం కార్పోరేషన్‌పై సిపిఐ గురి పెట్టింది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు సంపాదించిన సిపిఐ అదే రీతిలో నూతనంగా ఏర్పాటైన కార్పోరేషన్‌ను కైవసం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుంది. సంస్థాగతంగా బలమైన నిర్మాణం ఉండటం, శాసన సభ్యునిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఉండడంతో సిపిఐకి అదనపు బలం చేకూరింది. సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా గడిచిన కొంత కాలంగా కార్పోరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నారు. కూనంనేని సాంబశివరావు శాసన సభ్యునిగా చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ గెలుపు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలతో పాటు కార్పోరేషన్‌లోని అన్ని డివిజన్లలో ఇప్పటికే ఒక దఫా సమావేశాలను నిర్వహించారు. ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల్లో సైతం సిపిఐ అభ్యర్థులు బరిలో నిలుస్తారని సాబీర్‌పాషా తెలిపారు.

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీ : దండి సురేష్**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో కలిసి వచ్చే పార్టీలతో కలిసి పోటీ చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు నియోజక వర్గాల్లో తమ బలానికి అనుగుణంగా పోటీ చేస్తామని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని తమకు ఆమోదయోగ్యమైన ఒడంబడిక కుదిరితే ఆయా పార్టీలతో కలిసి పని చేసేందుకు సిద్ధమన్నారు.

**మణుగూరులో యథాతథ స్థితి :**

మణుగూరు మున్సిపాలిటీ ఏర్పాటు స్థానిక ప్రజలకు శాపంగా మారింది. గతంలో పంచాయతీగా ఉన్న మణుగూరును 20 ఏళ్ల క్రితం మున్సిపాలిటీగా మార్పు చేశారు. మణుగూరు ఏజెన్సీ ప్రాంతంలో ఉండడంతో కొంత మంది దీనిపై కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఎన్నికలు నిర్వహించడం లేదు. కొందరు మణుగూరును తిరిగి గ్రామ పంచాయతీగా మార్చాలని ఆందోళనలు చేపట్టారు. అటు మణుగూరును మున్సిపాలిటీగానే ఉంచి ఎన్నికలు నిర్వహించడం కానీ అలా సాధ్యం కాకపోతే తిరిగి గ్రామ పంచాయతీగానే ఉంచి ఎన్నికలు నిర్వహించడం కానీ ప్రభుత్వం చేయడం లేదు. పాలక వర్గాలు లేకపోవడంతో ఇష్టానుసారంగా మున్సిపల్ పాలన తయారైంది. గతంలో భద్రాచలాన్ని, సారపాక పట్టణాలను కూడా మున్సిపాలిటీగా ప్రకటించారు. ఏజెన్సీ చట్టాలు ఇతరత్రా సమస్యలతో తిరిగి పంచాయతీలుగా మార్చి ఇటీవల ఎన్నికలు నిర్వహించారు. అదేవిధంగా మణుగూరు పట్టణాన్ని కూడా గ్రామ పంచాయతీగా మార్చాలని లేదంటే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని స్థానిక రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

# భారత గడ్డపై సిపిఐది తిరుగులేని ప్రస్థానం


**(మొదటిపేజీ తరువాయి)**


సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలో గల గౌతమ్‌పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతవసంత పైలాన్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పేదలు, కార్మికులు, రైతులు, రైతుకూలీలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే నాటి నుండి నేటి వరకు ఎర్ర జెండా పనిచోస్తోందని చెప్పారు. రానున్న వందేళ్లు కూడా ప్రజలతో మమేకమై సిపిఐ ముందుకు సాగుతుందన్నారు. ఈనెల 18న ఖమ్మం కేంద్రంగా నిర్వహించిన సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సభకు దేశ విదేశాల నుండి కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు హాజరయ్యారని, కనీ వినీ ఎరుగని రీతిలో సభ జరిగిందని, లక్షలాది మంది హాజరైన ఈ సభ దేశ చరిత్రలోనే సువర్ణాధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టుల పని అయిపోయిందని అనేక మంది అవాకులు చెవాకులు పేలుతున్నారని, కమ్యూనిస్టుల సత్తా ఏంటో మొన్నటి సభతో దేశంలో సూడో మేధావులుగా చెప్పుకునే వారికి అర్ధమయ్యే ఉంటుందన్నారు. ప్రతీ కమ్యూనిస్టు కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని, ప్రజలతో మమేకమై ముందుకు సాగిన నాడు ఆ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని, ఆ దిశగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో



సిపిఐ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. వట్టికొండ మల్లిఖార్జునరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు మిర్యాల రంగయ్య, చలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, జీ వీరస్వామి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, భూక్య ధస్రు, ఎస్‌కే ఫయూం, జిల్లా సమితి సభ్యులు కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, మునిగడప వెంకటేశ్వర్లు, నేరెళ్ల రమేష్, నాయకులు తోట రాజు, బొర్రా కేశవరావు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బిసి వసతి గృహాన్ని తనిఖీ చేసిన వైరా తహశీల్దార్







ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డులో ఉన్న బిసి బాలుర వసతి గృహాన్ని వైరా తహశీల్దార్ సురేష్ బాబు తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండే వంటకాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా వంటకు సంబంధించిన వస్తువులను ఆయన పరిశీలించి విద్యార్థులను వంట ఏ విధంగా ఉంటుంది అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి తహశీల్దార్ సురేస్‌బాబు బోజనం చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడు తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వసతి గృహాన్ని తనిఖీ చేయడం జరిగిందని విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా భోజనం మంచిగా ఉందా లేదా అని తెలుసుకోవడం జరిగిందని ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతామని తెలిపారు.

# యువతరంతోనే దేశాభివృద్ధి : కూనంనేని

ప్రజాపక్షం/కొత్తగూడెం : యువ తరంతోనే దేశాభివృద్ధి ఆధారపడి ఉందని, సిపిఐలో చేరేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 8వ డివిజన్(పాల్వంచ)కు చెందిన పలువురు యువకులు కూనంనేని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా సమక్ష్యంలో గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కూనంనేని వారికి జిల్లా సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశప్రగతి యువతపై ఆధారపడి ఉందని, యువకులు కమ్యూనిస్టు భావాజాలాన్ని ఒంటపట్టించుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసేందుకు కృషి చేయాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలో చేరిన యువత వారివారి ప్రాంతాల్లో ఉన్న సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి పాటుపడాలని, ప్రతీ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపిన నాడు ఓ కమ్యూనిస్టుగా పొందె సంతృప్తి వేరుగా ఉంటుందని తెలిపారు. రానున్న కార్పోరేషన్ ఎన్నికల్లో పార్టీ తీసుకునే నిర్ణయాను సారంగా పని చేయాలని, అభ్యర్థుల గెలుపై లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కే రవీంద్రబాబు, జి ప్రశాంత్, పి మధు, సిహెచ్ సాయికిరణ్, కే హుస్సేన్, కే శివప్రసాద్, కే నాగేంద్రబాబు, కే సతీష్, కే మోహన్, ఎం జంపన్నల ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువకులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్ తదితరులున్నారు.

# నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కంచర్ల పెద్దయ్య



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం గొల్లెనపాడు గ్రామ సీనియర్ కమ్యూనిస్టు అమరజీవి కామ్రేడ్ కంచర్ల పెంటయ్య 26వ వర్ధంతి గురువారం గొల్లెనపాడు గ్రామంలో మోదుగు ఉపేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సెక్రటరీ యామాల గోపాలరావు మాట్లాడుతూ ఆనాడు గొల్లెనపాడు గ్రామంలో ఆనాటి నాయకులు కామ్రేడ్ వెంపటి సాంబయ్య, వెంపటి వెంకటయ్యతో కలిసి పనిచేసిన గొల్లెనపాడు చిన్న పెద్ద పంచాయతీలను ఓడ జగడాలను స్టేషన్ దాకా పోకుండా గ్రామపంచాయతీ సెంటర్‌లోనే కూర్చోబెట్టి పంచాయతీలు నిర్వహించి సమన్వయ సమన్వయపరిచే విధంగా రుచి చేసిన వ్యక్తి అని కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కంచర్ల పెంటయ్య, కూతురు చెరుకూరి పద్మ, జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆళ్ల వెంకట్రావు, పెద్ద రాజ, కంచర్ల నారాయణ, ప్రతాపనేని రమేష్, మోదుగు ఉపేంద్ర, కంచర్ల కృష్ణ, కంచర్ల వెంకన్న, కంచర్ల వెంకటి, కంచర్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నేడు బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

**-హాజరు కానున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



ప్రజాపక్షం/వైరా: నేడు బిఆర్ఎస్ వైరా మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశానికి స్థానిక మిట్టపల్లి గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు వైరా మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి విలేకరలు సమావేవఃలో గురువారం బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు స్వగృహంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ వైరా మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం స్థానిక మిట్టపల్లి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నామని వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో ఉన్న బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని పార్టీ దిశా నిర్దేశాన్ని పువ్వాడ అజయ్‌కుమార్ నిర్ణయిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు ముఖ్య కార్యకర్తలు సకాలంలో హాజరైన సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# కృష్ణారెడ్డికి నివాళి



ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని గాదెపాడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు దాచేపల్లి కృష్ణారెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న వైరా మాజీ ఎంఎల్‌ఏ లావుడియా రాములు నాయక్ వారి ఇంటి వద్దకు వెళ్లి వారి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఆత్మ కమిటీ ఛైర్మన్ ముత్యాల సత్యనారాయణ, వైస్ ఎంపిపి రావూరి శ్రీనివాసరావు, సొసైటీ వైస్ ఛైర్మన్ మంగీలాల మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, గుగులోత్ సురేష్, తదితర స్దానిక నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అనంతరం గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజీత ఇంటి వద్ద తేనెరు సేవించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భూక్య సోని జామ్లా, రామూర్తి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు భూక్య రంగారావు పాల్గొన్నారు.

# ఓటిపిఎస్ ద్వారా ఇసుక సరఫరా

**-పారదర్శకంగా ఇసుక సరఫరాకు చర్యలు**
**-అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓటిపిఎస్ ద్వారా పూర్తి పారదర్శకంగా ఇసుక పంపిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మన ఇసుక వాహనం ఆన్‌లైన్ వెబ్, మొబైల్ అప్లికేషన్‌పై తహసీల్దార్లకు, ఎంపిడివోలకు, ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక పారదర్శకంగా పంపిణీకి ఓటిపిఎస్ వెబ్, మొబైల్ అప్లికేషన్ ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అప్లికేషన్ అమలుకు వచ్చిన తర్వాత మాన్యువల్‌గా ఇసుక పంపిణీ చేయవద్దని కలెక్టర్ తెలిపారు. అప్లికేషన్ లాంచ్ కాగానే జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌లు, వాటిలో ఇసుక లభ్యతపై జాయింట్ తనిఖీలు చేపట్టి నివేదిక సమర్పించాలన్నారు. డాటాలో ఖచ్చితత్వం ఉండాలన్నారు. ఏ మండలంలో, ఏ రీచ్‌లో ఎంత క్యూబిక్ మీటర్ల మేర ఇసుక లభ్యత ఉందో అప్లికేషన్‌కు మ్యాపింగ్ చేయాలన్నారు. వచ్చే సోమవారం కల్లా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇసుక పంపిణీకి ధర నిర్ణయం చేపట్టాలన్నారు. సరసమైన ధరలో, సమయానికి ఇసుకను అందిస్తే వినియోగదారుడు ప్రైవేటుకు వెళ్లి నాసిరకం ఇసుకను కొనే అవసరం కలగదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ అవసరాలకు మొదటగా ఇట్టి అప్లికేషన్ ద్వారా ఇసుక పంపిణీ చేపట్టి ఆ తర్వాత ప్రభుత్వ నిర్మాణాలకు అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మన ఇసుక వాహనం వెబ్, మొబైల్ అప్లికేషన్‌పై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. యాప్ ప్రకారం పంచాయతీ కార్యదర్శులకు క్షేత్ర తనిఖీ, ఆమోదం తెలపాల్సి ఉన్నందున ఇట్టి దానిపై ఎంపిడివోలు, మండల స్థాయిలో వర్క్‌షాప్ ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శులకు, ట్రాన్స్‌పోర్ట్ వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆమోదం పిదప తహసీల్దార్‌చే టోకెన్ జారీ చేయుట జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజల్లో ఓటిపిఎస్ వెబ్, మొబైల్ అప్లికేషన్ పై పూర్తి అవగాహన కలిగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధాకృష్ణ, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తహసీల్దార్లు, ఎంపిడివోలకు ఓటిపిఎస్ వెబ్, మొబైల్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్లు, ఎంపిడివోలు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, ఎడి మైన్స్ సాయినాథ్, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గురువారం ఖమ్మం డిపో ఆర్టిసి ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని త్రివేణి పాఠశాలలో ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, బస్టాండ్ మేనేజర్ రఘుబాబు, త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను ఎలా నివారించవచ్చో విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి ఆర్టిసి ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో జనసేన పోటీ


**- జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జి మిరియాల రామకృష్ణ**




**ప్రజాపక్షం/మధిర :** నిబద్ధతతో ప్రజా సేవ చేయడానికి మధిర మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనసేన పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి మిరియాల రామకృష్ణ అన్నారు. గురువారం మధిరలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా చైతన్యవంతమైన మధిర ప్రాంతంలో గతంలో ఎన్నడూలేనివిధంగా రౌడీయిజం, గంజాయి రాజ్యమేలుతుందని అన్నారు. గత 20 సంవత్సరాలుగా మధిర ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. మధిరలో వందల కోట్ల రూపాయల నిధులతో శంకుస్థాపనలు తప్ప అభివృద్ధి ఎక్కడా కనరావడం లేదన్నారు. మధిర కేంద్రానికి విజవయవాడ నుండి ఖమ్మంకు సరైన కనెక్టివిటీ రోడ్డు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. మధిర మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని, 22 వార్డులకు 50దరఖాస్తులు జనసేన పార్టీకి వచ్చాయని అన్నారు. మధిర మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే జనసేన పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ ప్రజా సేవ చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో జనసేన మండల నాయకులు మోదుగు రమ్య, అనంత శివరామకృష్ణ, తాళ్ళూరి డేవిడ్, అనుమోల నరేష్, మందడపు రామకృష్ణ, దీపకళ, సాయితేజ, పవన్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**తెలంగాణ గ్రామీణబ్యాంక్ కొణిజర్ల శాఖ మేనేజర్ విద్యాసాగర్**




**ప్రజాపక్షం/కొణిజర్ల :** తెలంగాణ గ్రామీణబ్యాంకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆబ్యాంకు కొణిజర్ల శాఖ మేనేజర్ విద్యాసాగర్ అన్నారు. ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత శిబిరాల్లో భాగంగా మండలంలోని మల్లుపల్లిలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ మోసాలపై ఎలా అప్రమత్తంగా ఉండాలి అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో బ్యాంకుద్వారా అందిస్తున్న పిఎంజేజేబివై, పిఎంఎస్‌బివై, ఏపివై తదితర పథకాలపై ప్రజలకు అర్థమయ్యేరీతిలో కళాజాతా బృందాలు ప్రదర్శనలు ఇచ్చారు. ఈసందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతు రైతులు, మహిళాసంఘాలు స్వయం సమృద్ధికోసం అన్ని బ్యాంకులద్వారా విరివిగా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్లకు మిగతా బ్యాంకులకంటే ఎక్కువ వడ్డీ అందిస్తున్నట్లు వివరించారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని వీటిపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఖాతాలో డబ్బుపోయినట్లయితే సైబర్ క్రైమ్ కాలసెంటర్ 1930 నంబర్‌కు ఫోన్‌చేసి ఎప్పాలన్నారు. ఈకార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు కె భార్గవసాయికృష్ణ, కిషోర్, సర్పంచ్ చింతామణి, గ్రామపెద్ద బదావత్ రాము, బ్యాంకు సిబ్బంది, డ్వాక్రాసంఘాల లీడర్లు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** వాహనాలు నడిపే వారందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పీ ఆర్.సతీష్ కుమార్ అన్నారు. గురువారం అశ్వారావుపేటలోని అగ్రికల్చర్ కళాశాలలో ఎజి కళాశాల, వికెడివిఎస్ కళాశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాద నివారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్టు ప్రాముఖ్యత, మద్యం సేవించి డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే అనార్థాలను గతంలో ఈ ప్రాంతంలో జరిగిన సంఘటనలను ఉదహరిస్తూ వివరించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞను చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.నిర్మల, ఏరియా హాస్పటల్ డాక్టర్ బి.విజయ్‌కుమార్, అశ్వారావుపేట సిఐ పి.నాగరాజు, ఎస్సై టి.యయాతి రాజు, దమ్మపేట ఎస్సై బి.సాయికిషోర్‌రెడ్డి, కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

# చొప్పకట్లపాలెం గ్రామ అభివృద్ధే నా ధ్యేయం

**- సర్పంచ్ కాత్రేపల్లి అశ్విని**



**ప్రజాపక్షం/బోనకల్ :** బోనకల్ మండలం చొప్పకట్లపాలెం గ్రామ అభివృద్ధే నా ధ్యేయమని సర్పంచ్ కాత్రేపల్లి అశ్విని అన్నారు. చొప్పకట్లపాలెంలో ఇటీవల గెలుపొందిన సర్పంచ్ కాత్రేపల్లి అశ్విని తనదైన మార్పును చూపిస్తూ ప్రజలకు అనునిత్యం చేదోడు, వాదోడుగా ఉంటూ గ్రామంలో పారిశుద్ధ్య, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన మీద నమ్మకంతో గెలిపించినందుకుగాను ప్రతిఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ ఈ ఐదు సంవత్సరాలు ఎటువంటి రాగద్వేషాలు లేకుండా ప్రజా సేవకే అంకితం చేస్తానని పేర్కొన్నారు.

# అవగాహన కలిగి ఉండడమే నిజమైన అప్రమత్తత



**ప్రజాపక్షం/ బోనకల్ :** మానవ అక్రమ రవాణాపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండడమే అసలైన అప్రమతత్త అని, పిల్లలు, మహిళలు ఎవరూ కూడా అక్రమ రవాణా గురికాకుండా సురక్షితంగా ఉండాలని మండల విద్యాశాఖఅదికారి దామాల పుల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆళ్లపాడు ఉన్నత పాఠశాల నందు స్కోప్ ఆర్డిమై ఛాయిసెస్ ఫౌండేషన్, పోలీస్ మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలో మూడవ అతిపెద్ద వ్యవస్థీకృతమైన నేరం అని, అది ఏ రూపంలోనైనా మహిళలను, పిల్లలను అక్రమ రవాణాకు గురి చేస్తుందని హెచ్చరించారు. పేదరికం విద్య లేకపోవడం, అవగాహన కలిగి ఉండకపోవడం బాల కార్మికత, వైకల్యం ఉన్న వ్యక్తులు అసురక్షిత వలసలు, ఆధునిక బానిసత్వం ఈ విధంగా వివిధ రూపాల్లో అక్రమ రవాణాదారులు తమ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటారని తెలిపారు. విద్యార్థులకు చెడు, మంచి ప్రవర్తనపై అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణదారుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, ఏవైనా మసస్యలు ఉంటే వెంటనే చైల్డ్ లైన్ 1098, పోలీస్ డైల్ 100, జాతీయ లైంగిక అక్రమ రవాణా టోల్ ఫ్రీ నెంబర్ 18004198588కు ఫోన్ చేసి తెలిపి సహాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కోప్ ఆర్డి కోఆర్డినేటర్ కే.సుజాత, భరోసా కేంద్రం ఎస్సై షాహినా, కోఆర్డినేటర్ రాజకుమారి, టీం సభ్యులు, సునీత, షీటీం కానిస్టేబుల్స్ రుక్మిణి, కిరణ్, పాఠశాల హెచ్‌ఎం శ్రీలత, బ్లూకోల్ట్ కానిస్టేబుల్స, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖమ్మం డిపో ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం డిపో ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ రక్తదానం మహాదానమని ఆపదలో ఉన్న వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేసిన 40 మంది ఉద్యోగులకు సర్టిఫికెట్లు ఆర్‌ఎం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ వి. మల్లయ్య, డిపో మేనేజర్ ఎం. శివప్రసాద్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల కమ్యూనిస్టు సీతయ్య

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం





**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సీనియర్ నాయకులు సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాల్లో పనిచేసిన రెడ్డెబోయిన సీతయ్య నిబద్ధత గల కమ్యూనిస్టు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగానే ఆయన జీవించారని ఆయన తెలిపారు. సీతయ్య దశదిన కర్మ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయస్సులో కమ్యూనిస్టు పార్టీ కోసం పనిచేస్తూ జైలుకు కూడా వెళ్లారని ఆయన తెలిపారు. ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, సైదా, జ్వాలా నర్సింహారావు, నాయకులు ఇటికాల రామకృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకం




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** జాతీయ సేవా పథకంలో భాగంగా గ్రామాలను సందర్శించి సామాజిక సేవ అందించడంలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకమని రఘునాథపాలెం సర్పంచ్ గాజుల కృష్ణారావు తెలిపారు. ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల సోషల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా గురువారం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గాజుల కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా గ్రామంలో సేవ చేస్తున్న విద్యార్థులను అభినందించారు. గ్రామ పరిధిలో వివిధ సామాజిక, ఆర్థిక, జీవన స్థితిగతులపై విద్యార్థులు నిర్వహించే సర్వేకు సహయ సహకారాలను అందిస్తామన్నారు. చదువుతో పాటు ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డా॥ ఎం. పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి. ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి అనురాధ, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా॥ ఎన్. శ్రీనివాసరావు, కళాశాల ఐక్యు ఏసి కో ఆర్డినేటర్ డా॥ ఎం. సునంద, ఎగ్జామ్ కంట్రోలర్ డా॥ రామా సత్యవతి, వార్డు సభ్యులు చరణ్, బుచ్చిబాబు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# సెల్‌టవర్ నిర్మాణం వద్దు..ప్రజల ప్రాణాలే ముద్దు

### పనులను అడ్డగించిన గ్రామస్తులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం కెజి సిరిపురం గ్రామంలో సెల్‌టవర్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా గృహాల మధ్య నిర్మిస్తుండగా గ్రామ ప్రజలు సెల్‌టవర్‌ని వ్యతిరేకిస్తూ పలుమార్లు పనులను అడ్డగించారు. అయినా గాని వారు ఇవేమి పట్టనట్టుగా గ్రామ ప్రజల ప్రాణాలతో చెలగాటాలు ఆడుకుంటూ నిర్మాణ పనులను మళ్లీ మొదలుపెట్టారు. గ్రామస్థులు నిర్మాణ పనుల విషయాన్ని తెలుసుకొని గ్రామ ప్రజలందరూ ఒక్కటై సెల్‌టవర్ నిర్మాణం వద్దకు వెళ్లి నిర్మాణానికి తీసిన గుంటల్లో దిగి నిరసన తెలిపి మా సమాధులపై మీరు సెల్‌టవర్ నిర్మించుకోండి అంటూ కుంటలో దిగి ఆందోళన చేశారు. కొద్దిసేపు గ్రామం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అనంతరం స్థానిక ఎస్సై పుష్పాల రామారావు వచ్చి గ్రామస్థులకి నచ్చజెప్పి కొద్దిరోజులు పనులను ఆపమని సెల్‌టవర్ నిర్మాణ యజమానులకు చెప్పగా గ్రామస్థులు ఆందోళనను విరమించుకున్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక నందు 100 కళ్యాణ లక్ష్మి, 1 షాదీ ముబారక్, 32 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాగమయి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని సంక్షేమ పథకాలు అమలు చేసి నిరూపించిందన్నారు. పేద తల్లిదండ్రులకు ఆడపిల్ల పెళ్లి భారం కాకుండా ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా అండగా ఉంటుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత కరెంటు, రుణమాఫీ, రైతు బోనస్, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిందని అన్నారు. రాబోవు జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆమె కోరారు.

# మామిడి తోటలపై యాజమాన్య పద్ధతులు పాటించాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో సాగు చేస్తున్న రైతులకు మామిడి సాగు పై యాజమాన్య పద్ధతులను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ సంవత్సరం పూత సంతృప్తి కరంగా ఉందని ప్రస్తుతం చాలావరకు చెట్లు పూర్తిగా కోత దశలో ఉన్నాయని ఈ దశలో రైతులు చేపట్టే యాజమాన్యంపైనే పంట దిగుబడులు వస్తాయని, ఉద్యానవన శాఖ అధికారి జి నగేష్ రైతులకు సూచించారు. మామిడిలో పిందెలు ఏర్పడి పెరిగే దశలో చెట్లు సైజును బట్టి యూరియా పోటాష్ ఎరువులను క్రమ పద్ధతిలో వేసుకోవాలని అప్పుడే నాణ్యమైన అధిక దిగుబడి వస్తాయని వివరించారు. కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో గురువారం రైతులకు మామిడి తోటలలో ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలలో మామిడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## శకుంతలకు నివాళి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** చింతగుర్తి మాజీ సర్పంచ్ మెంటెం రామారావు మాతృమూర్తి మెంటెం శకుంతల ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె మృతికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు. గురువారం చింతగుర్తిలో జరిగిన శకుంతల దశదిన కర్మలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరై ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. మేయర్ పునుకొల్లు నీరజతో పాటు పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరునాయక్, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు, సర్పంచ్ కొంటెముక్కల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, నాయకులు బత్తుల మురళి, దేవభక్తిని కిషోర్, మాధంశెట్టి హరిప్రసాద్, పిన్ని కోటేశ్వరరావు, చెరుకూరి ప్రదీప్, యాసా రామారావు, తాతా వెంకటేశ్వర్లు, దొంతు సత్యనారాయణ, నున్నా శ్రీను, సంగయ్య, వెంకటేశ్వర్లు, సూర్య, కుతుంబాక నరేష్, దానయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్, సిబ్బంది సేవలు మరువలేనివి

**- కార్పొరేటర్ బిజి క్లైమెంట్**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాల సందర్భంగా ఈనెల 18 నుంచి 21 వరకు జరిగిన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు ఎటువంటి అంతరాయం కలుగకుండా, పారిశుధ్యానికి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ కమిషనర్‌తో పాటు సిబ్బంది అందించిన సేవలు మరువలేనివని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లైమెంట్ తెలిపారు. ఈనెల 18న పెద్ద సంఖ్యలో ప్రజలు బహిరంగ సభకు తరలి వచ్చారని ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శన, బహిరంగ సభ సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారని ఆయన తెలిపారు. సభ అనంతరం కూడా పారిశుధ్య పనులు చేపట్టి నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూశారని ఆయన తెలిపారు.

## చేతి పంపు ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం దేశినేనిపాలెం గ్రామంలో క్రీస్తు సంఘం చర్చి ఆవరణంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం వారిచే ఏర్పాటు చేసిన మంచినీటి బోరు చేతి పంపును గ్రామ సర్పంచ్ సోమ అనురాధ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి బోరు చేతి పంపు ఏర్పాటు చేసిన గ్రేస్ సర్వీస్ సొసైటీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బిఇ.పాల్, సొసైటీ సభ్యులు జాన్, సంఘ కాపరి సిహెచ్.రవి, గ్రామ పెద్దలు, సంఘస్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కప్ 2026 క్రీడలు ప్రారంభం





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం సిరిపురం కెజి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిఎం క్రీడలను శుక్రవారం గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఎం కప్ ముఖ్య ఉద్దేశ్యం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా రంగంలో నైపుణ్యం కలిగిన విద్యార్థులను గుర్తించడం జరుగుతుంది. వారి ప్రతిభను గుర్తించిన అనంతరం నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపిక చేసి వారిని ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకువెళ్లడానికి సిఎం కప్ ఉద్దేశ్యమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ పుష్పావతి, మాజీ సర్పంచ్ తాటి వెంకటేశ్వర్లు, కామినేని శ్రీనివాసరావు, దరిపల్లి నారాయణ, నాంచారి తిరుపతమ్మ, కాటమ్మ, మున్నా, పంచాయతీ కార్యదర్శి నాగశేషరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ ఇనపనూరి కృష్ణమ్మ, జెడ్పిహెచ్ఎస్ స్కూల్ హెచ్ఎం సూర్యకుమారి, పిటి సభాన, గ్రామ పెద్దలు,విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించుకుందాం


**- నియమాలు ఉల్లఘించి ఇబ్బందులకు గురికావద్దు**
**- ట్రాఫిక్ నియంత్రణకు త్వరలో బైపాస్ రోడ్**
**- శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు**




**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించుకుందామని, రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించాలని శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తగూడెం డిఎస్పి ఆధ్వర్యంలో మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అరైవ్, అలైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పోలీసులు ప్రమాదరహిత సమాజం కోసం చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు బాగున్నాయని, రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యతే కాదని, ఇది అందరి సమిష్టి బాధ్యత అన్నారు. వాహనాలు నడిపే క్రమంలో తప్పని సరిగా నియమాలు పాటించాలని హెల్మెట్, సీటు బెల్టులు ధరించాలని, మితిమీరిన వేగాన్ని తగ్గించి వాహన సామర్ధ్యానికి అనుగుణంగా రోడ్లపై నడపాలని సూచించారు. వాహనాలు వేగంగా నడపడం ద్వారా అనుకోని ప్రమాదాలు జరిగితే నియంత్రించడం కష్టతరంగా ఉంటుందని, తద్వారా ప్రాణాల మీదికి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని, తద్వారా వారి కుటుంబ సభ్యులు అనాధలుగా మారుతున్నారని చెప్పారు. ప్రతీ ప్రాణం విలువైందే అని, దీనిని గమనంలోనికి తీసుకుని ప్రవర్తించాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించి ఎదుట వారిని ఇబ్బందుల పాలు చేయరాదని, ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని కూనంనేని సూచించారు. కొత్తగూడెంలో ట్రాఫిక్ నియంత్రణకు త్వరలో రూ.45 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరలో చేపడుతున్నట్లు చెప్పారు. అదే విధంగా పట్టణంలోని ప్రధాన ఇరుకు రోడ్లును అనువుగా మార్చేందుకు సింగరేణి సౌజన్యంతో రోడ్ల వెడల్పు కార్యక్రమంతోపాటు మరమ్మత్తులు చేయబోతున్నట్లు చెప్పారు. ప్రజల భద్రత, రక్షణ కోసం అనునిత్యం పనిచేస్తున్న పోలీసులను ఎంఎల్ఏ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, 2 టౌన్ సిఐ ప్రతాప్, 3 టౌన్ సిఐ శివప్రసాద్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్, ఎస్సై విజయకుమారి, పట్టణ వ్యాపారులు, స్థానికులు, ప్రముఖులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మామిడి రైతులకు రాయితీపై మామిడిపండ్ల కవర్లు పంపిణీ

**పాలేరు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి పి.అపర్ణ**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మామిడి తోటలు పెంచే రైతులు వేసవి సీజన్లో మామిడి తోటలకు ఎక్కువగా చీడపీడలు వ్యాపించి మామిడికాయ పూర్తిగా పక్వానికి పండు దశకు వచ్చే క్రమంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని దీనిని నివారించడానికి ప్రభుత్వం రాయితీపై కవర్లు పంపిణీ చేస్తుందని ఉద్యానవన శాఖ అధికారి పి.అపర్ణ అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని మామిడి రైతులు పూత దశ నుంచి కాయ దశకు వచ్చే ముందు కవర్లు తొడగడం ద్వారా చీడపీడల వ్యాపించకుండా నాణ్యమైన మామిడి పండ్లు అధిక దిగుబడి సాధించవచ్చు అని తద్వారా బహిరంగ మార్కెట్లో మామిడిపండ్లకు మంచి డిమాండ్ ఉంటుందని ఆమె తెలిపారు. రాయితీ వివరాలు ఒక కవరు ఖరీదు 2.50 రూపాయలు అందుకు గాను 50 రాయితీ అనగా 1.25 రూపాయలు రాయితీ ఇవ్వబడుతుంది. ఒక ఎకరానికి 8000 పండ్ల కవర్లు గరిష్టం గా 5 ఎకరాలకు రాయితీ ఇవ్వబడుతుంది (ఒక రైతుకు 40000 కవర్లకి రాయితీ ఇవ్వబడుతుందని ఇట్టి రాయితీలను మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని దరఖాస్తు కోసం పాలేరు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి పి.అపర్ణ 8977714104. ఇట్టి సెల్ నెంబర్ కు ఫోన్ చేసి మామిడి పండ్ల రైతులు వివరాలు తెలుసుకోవాలని ఆమె తెలిపారు.

# బహుజనుల్లో చైతన్యం రావాలి

**-రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్ మడత వెంకట్ గౌడ్**



**ప్రజాపక్షం/ఇల్లందు:** బహుజనుల్లో చైతన్యం వచ్చినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్ మడత వెంకట్ గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఏక్తా హౌస్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల బీసీ నాయకులతో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశ్నించే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలకతీతంగా నిలబడే బహుజనుల కౌన్సిలర్‌గా ఎన్నుకోవాలన్నారు. చదువుతో పాటు అర్హత, ప్రశ్నించేతత్వం, అభివృద్ధి చేసే ఆలోచన, కలుపుకుపోయే గుణం, సమస్యలపై స్పందించే ఆరాటం ఉన్న నాయకులను ఎన్నుకున్నప్పుడే పరిపాలన బాగా జరుగుతుందన్నారు. అర్హతలు లేని కౌన్సిలర్లు ఎంత మంది పోటీల్లో ఉన్నారనేది ప్రజలంతా గమనించాలన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ 120 కోట్ల నిధులను కొట్లాడి తీసుకొచ్చి అభివృద్ధి పరుగులు పెట్టించడం ప్రజలంతా నాడు, నేడు గుర్తిస్తున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు మంచి అభ్యర్థులను ఎంపిక చేసుకుని ఓట్లు వేసి పరిపాలన సజావుగా సాగే విధంగా చూసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో బహుజనుల నాయకులు ముద్రగడ వంశీ, సాల్మన్ రాజు, కోటగిరి రాజేందర్, భరత్, బాణాల శ్రీనివాస్, మామిడి శివ, గార్ల సంపత్, విక్కీ, విన్ను, గోపి, గార్ల రమేష్, బండి సతీష్, బాబా, మున్నాఫ్, చరణ్, నరేష్, బిఎన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని ప్రభుత్వ రంగ సంస్థలలో జీవనోపాధి పెంపొందించుకోవడానికి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోని జీవితాల్లో స్థిరపడాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గురువారం ఐటిడిఏ ప్రాంగణంలోని వైటిసిలో గిరిజన యువతీ యువకులకు గెస్ట్ సర్వీస్ అసిసోయేట్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ సర్వీస్ ఎలక్ట్రీషియన్ శిక్షణ అందిస్తున్న కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ శిక్షణ పొందిన వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంది వచ్చే అవకాశాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. 60 రోజుల పాటు జరిగే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవితాల్లో స్థిరపడాలని సూచించారు. పనిచేసే ప్రదేశంలో ఓపిక చాలా అవసరమని, హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. అనంతరం ఈ నెల 27న జరిగే ఎస్ఆర్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి గిరిజన భవన్ వద్ద పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు, జేడిఎం హరికృష్ణ పాల్గొన్నారు.

# నేటి సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** దేశ స్వతంత్ర సంగ్రామంలో అలుపెరుగని పోరాటం చేసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేసి బ్రిటిష్ వారిని ముప్పు తిప్పలు పెట్టిన మహానేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఆయన జయంతి వేడుకలను తిరుమలాయపాలెం మండలం కేంద్రంలో ఘనంగా నిర్వహించబడతాయని జిల్లా కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయిల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి తరానికి ఎంతో ఆదర్శ మూర్తిని ఆయన లాంటి దేశభక్తిడి ఆశయాలను కొనసాగించాలంటే యువతరం ముందుకు నడవాలని దేశ సమగ్రతను ప్రపంచ దేశాలకు సాటి చెప్పాలని ఆయన కోరారు. శనివారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడతాయని ఆయన అన్నారు.

# ఉత్సాహంగా సీఎం కప్ అటల పోటీలు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సీఎం కప్పులో భాగంగా రెండవ రోజు జూలూరుపాడు క్లస్టర్ స్థాయి లో జరిగినటువంటి కబడ్డీ పోటీలు జిల్లా పరిషత్ హై స్కూల్ నరసాపురంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ క్లస్టర్ స్థాయి క్రీడల్లో సుమారుగా 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు వారి మధ్య కబడ్డీ పోటీలు నిర్వహించుకోవడం మండల విద్యాశాఖ అధికారి బి జుంకీలాల్ తులసిరాం మరియు గ్రామ సర్పంచి గ్రామ పెద్దలు పాల్గొని విజయవంతం కావించారు. అలాగే మూడవరోజు రేపు కాకర్ల హైస్కూల్ నందు వాలీబాల్ పోటీలు నిర్వహించుకోబోతున్నాము కనుక జూలూరుపాడు క్లస్టర్ లెవెల్ లో ఉన్నటువంటి రేపు కాకర్ల హైస్కూల్ నందు వాలీబాల్ క్రీడల్లో పాల్గొనవలసిందిగా ఎంఈఓ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. ఈ క్రీడలు మానసిక ఉల్లాసం మనోధైర్యం శారీరిక దేహ దారుఢ్యం జాతీయ భావం పెంపొందించుకోవాలని సూచించారు.

# అటవీ పట్టా భూముల్లో బోర్, విద్యుత్ అనుమతి ఇవ్వండి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అటవీ భూ మి ఆర్ఓఎఫ్ఆర్ పట్టా భూ ములకు బోరు, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఐటీడీఏ ఏపీఓకి మెమొరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజన రైతులు కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్నారని వారికి నీటి సమస్య ఇబ్బందికరంగా అయిందని, వారు వర్షాధార పంటలపై ఆధారపడి ఉన్నారని బోరు లేక వ్యవసాయం చేయడానికి నీరు లేక గిరిజన రైతులు పంటలు నష్టపోతున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వారు అధికారులు తక్షణమే ఆటవిపట్ట భూములకు వ్యవసాయం చేయడానికి బోరు, విద్యుత్ కలెక్షన్ తక్షణమే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏనుకూరు మండల అధ్యక్షులు వీరన్న నాయక్, మహేష్ నాయక్, రమాదేవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# వెంకట రమణకు మెరుగైన వైద్యం అందించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఓ. సి 4 గురువారం మొదటి షిఫ్ట్ లోయస్ వెంకటరమణ అనే సీనియర్ ఈ. పి ఆపరేటర్ 40 టన్స్ క్రేన్ నడుపుతుండగా ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న మణుగూరు ఏరియా ఏఐటియేయూసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ రామ్ నర్సయ్య స్థానిక సింగరేణి హాస్పిటల్‌కు వెంటనే వెళ్ళి క్షతగాత్రుడిని పరామర్శించారు.. ప్రమాదానికి గల కారణాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్వారీలో లైటింగ్ స్తంభాలు తీయడానికి వెళుతుండగా రన్నింగులో ఇంజన్ ఆగినట్టు ఉన్నఫలంగా స్టీరింగ్ స్ట్రక్ కావడంతో క్రెన్ పై నుంచి ప్రాణ రక్షణ కోసం దూకినట్టు తోటి కార్మికులు తెలియజేశారు. ఎత్తు భాగం నుంచిదూకుడు మూలంగా నడుముకు గాయమైనట్టు వైద్యులు తెలిపారు. వెంకట రమణకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆయన తెలియజేశారు. సరిపడా టెక్నీషియన్స్ లేకపోవడం, మ్యాన్ పవర్ లేకపోవడం, వెహికల్స్ ని కండిషన్లో ఉంచకపోవడం, స్పేర్ పార్ట్స్ లేకపోవడం వలన ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు మేనేజ్మెంట్తో సేఫ్టీ సమావేశాలలో, స్ట్రక్చర్ సమావేశాలలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియూసి యూనియన్ గా యాజమాన్యం దృష్టికి సమస్యలను ఎన్నిసార్లు తీసుకెళ్లినా చర్యలు శూన్యం అని అన్నారు యాజమాన్యానికి ఉత్పత్తి పై ఉన్న శ్రద్ధ,రక్షణ, కార్మికుల సంక్షేమం పై లేదని అన్నారు. ఈ ప్రమాదం నకు పూర్తి బాధ్యత యాజమాన్యం వహించాలని అన్నారు.

# మోడీ పాలనలో పెరుగుతున్న నిరుద్యోగం

**-ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు రోషన్‌కుమార్ సిన్హా**
**-ఏఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశంలో ప్రధాని మోడీ బిజెపి పాలన లో నిరుద్యోగ తీవ్రత రోజు రోజుకు పెరుగుతుందని ఆలిండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) జాతీయ అధ్యక్షులు రోషన్ కుమార్ సిన్హా తెలిపారు. గురువారం ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల ఫోటోలతో, నిరుద్యోగుల డిమాండ్స్‌తో రూపొందించిన 2026 క్యాలెండర్‌ను ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు రోషన్ కుమార్ సిన్హా , ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా నాయులు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్ అధ్యక్షత న జరిగిన సభలో రోషన్ కుమార్ సిన్హా మాట్లాడుతూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందన్నారు. ఒక వైపు నిరుద్యోగ తీవ్రత పెరుగుతుంటే మరో వైపు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చి దానిని నిర్వీర్యం చేసేందుకు కుట్ర సాగుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి, ఉద్యోగ క్యాలెండర్‌ను అమలు చేసి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ముద్రించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ శ్రీమాన్, ఖమ్మంజిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, నాయకులు చిర్రా ఉపేందర్, దాసరి బన్ను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మర్కోడు ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్





**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల పరిధిలోని మర్కోడు బాలుర ఆశ్రమ పాఠశాలను గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకస్మికంగా సందర్శించి, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాలను పరిశీలిస్తూ బోర్డుపై రాయించి పుస్తకాలు చదివించి వారి అభ్యాస స్థాయిని పరీక్షించారు. తరగతి గదిలో కాసేపు జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయుడుగా మారి విద్యార్థులకు విద్య బోధన చేశారు. వలస వచ్చిన ఆదివాసి గిరిజనుల విద్యార్థులకు సామర్థ్యాలు చదవడం రాక పోవడంతో వెంటనే అర్థం చేసుకున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పందించి ట్యాబ్ పాఠశాలకు అందజేస్తామని ప్రధానోపాధ్యాయుడికి తెలిపారు. తెలుగు భాషా రాని గిరిజన విద్యార్థులకు డైలీ డిజిటల్ క్లాస్ వినిపిస్తే ఆ మాటలు విని కొద్దిగా అయినా తెలుగు అక్షరాలు సామర్థ్యాలు అర్థం చేసుకుంటారని అన్నారు. విద్యార్థులకు హోం వర్క్ నోట్ బుక్‌లో ప్రతి రోజు ఒక పేజీ నిండా హోంవర్క్ పెట్టించాలని సూచించారు. తదనంతరం విద్యార్థుల మరుగుదొడ్లు, డైనింగ్ హాల్ తదితర మౌలిక వసతులను జిల్లా కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. మరుగుదొడ్ల పరిశీలన సమయంలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడానికి గమనించి కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకొని, నిరంతరం నీటి సరఫరా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డైనింగ్ హాల్ వంట నిర్వహణ విధానాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు శుభ్రమైన పోషకాహారంతో కూడిన నాణ్యమైన రుచికరమైన భోజనం తప్పని సరిగా అందించాలని వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎలాంటి లోటు పాట్లు తలెత్తిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలోని కిచెన్ షెడ్ నిర్మాణానికి అవసరమైన నివేదికలను వెంటనే సమర్పించాలని అధికారులను కోరారు. అదే విధంగా మర్కోడు ఎంపీపీఎస్ పాఠశాల ప్రహరీ, కిచెన్ షెడ్ మరుగుదొడ్ల అభివృద్ధి పనులు చేయకుండా ముందుగానే సదరు కాంట్రాక్టర్ బిల్లులు డ్రా చేసుకొని నాణ్యత లోపంతో అసంపూర్తిగా పనులు చేపట్టారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అగ్గి రామకృష్ణ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సంబంధిత అధికారి ఏఈతో చరవాణిలో మాట్లాడి వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని లేకపోతే నిధులు బిల్లులు అమౌంటు రికవరీ పెట్టాలని ఆరా తీసి అభివృద్ధి పనులు త్వరగతిన పూర్తి చేయని యెడల సస్పెండ్ చేస్తామని అన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఆన్‌లైన్ ద్వారా ఇసుక

**- మన ఇసుక వాహనం పైలెట్ ప్రాజెక్టు అమలు : కలెక్టర్**




**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రభుత్వ అవసరాలకు ఇక నుండి ఆన్‌లైన్ ద్వారానే ఇసుక రవాణా అందిస్తారని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇసుక వాహనం పైలట్ ప్రాజెక్టును జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇసుక రవాణా సరఫరా వ్యవస్థను పారదర్శకంగా, నియంత్రిత విధానంలో అమలు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మన ఇసుక మన వాహనం ఆన్లైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. టిజిఎండిసి తహశీల్దార్లు, పంచాయితీ కార్యదర్శులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇకనుండి జిల్లాలో ఇసుక సరఫరా మన ఇసుక వాహనం ద్వారానే ఆన్‌లైన్ పద్ధతుల్లో జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రతీ లావాదేవీలు ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. ఇందులో ఎలాంటి మానవ జోక్యం ఉండదన్నారు. మండలాల వారీగా ఇసుకకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక రీచ్‌లు గుర్తించాలని సూచించారు. ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతం అయ్యేందుకు అధికారులంతా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడి అధికారులు, టిజి ఎండిసి సిజిఏ హైదరాబాద్ ప్రతినిధులు, మండలస్థాయి తహశీల్దార్లు,ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని పడమట నర్సాపురం గ్రామంలో కొలువైన వనదేవతలను దర్శించుకోడానికి వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ హాజరైనారు. ఈ జాతరలో ఉత్సాహంగా సాగుతున్న కొమ్ము నృత్యంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొని నృత్యం చేస్తూ డప్పు వాయించారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గం ప్రజలను చల్లగా దీవించాలని వేడుకున్నారు. మండల పరిధిలోని పడమటి నరసాపురం గ్రామంలో జరుగుతున్న వనదేవతల సమ్మక్క సారలమ్మ తల్లుల జాతర రెండవ రోజు పూజా కార్యక్రమాలను కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కి ఆలయ కమిటీ సభ్యులు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. మూడు రోజులు ఈ జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. మొక్కులు చెల్లించుకొనుటకు వచ్చు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు, భక్తులు భారీగా పాల్గొన్నారు.

# ప్రత్యేక అధికారి ఆశ్రమ పాఠశాల తనిఖీ



**ప్రజాపక్షం/కల్లూరు:** మండల ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్ ఈఈ పుష్పలత గురువారం గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికల ఉన్నత పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, పరిసరాలు పరిశుభ్రత విద్యాభివృద్ధి బాలికలకు ప్రత్యేక తరగతులు వ్యక్తిగత పరిశుభ్రత పై తనిఖీలు సలహాలు, సూచనలు చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన భోజనం విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థిని విద్యార్థులు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 40 మందికి సామాజిక శిక్ష



**ప్రజాపక్షం/భద్రాచలం :** డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన 40 మంది వ్యక్తులకు భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్ సామాజిక శిక్ష విధించారు. ఆ 40మందిని పట్టణ పోలీసులు గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా వారికి జరిమానా విధించిన న్యాయమూర్తి కోర్టు ఆవరణలో మొక్కలు నాటించారు.దీనిని పలువురు అభినందించారు. వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించి నడపరాదని సూచించారు. గతంలోసైతం డ్రంగ్ అండ్ డ్రైవ్‌లో దొరిగిన కొంద రితో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు శుభ్రం చేయించిన విషయం విధితమే.

# ఉప సర్పంచ్‌ల సంఘం సమావేశం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం,సమితి సింగారం గ్రామ పంచాయతీ పరిధిలో గల పద్మశాలి భవన్ లో జరిగిన మణుగూరు మండల ఉప సర్పంచ్ ల సంఘం సమావేశం నిర్వహించారు. మణుగూరు మండల ఉపసర్పంచ్ ల సంఘం అధ్యక్షులు గాండ్ల సురేష్ , ప్రధాన కార్యదర్శి గోరంట్ల కనకయ్య, కోశాధికారి కొట్టెం మనోజ్ కుమార్, గౌరవ సలహాదారులు గువ్వా రాంబాబు, ఉపాధ్యక్షులు పులిగిల్ల రమేష్, సహాయ కార్యదర్శిగా బోడ శీను నాయక్, కార్యవర్గ సభ్యులుగా సభ్యులుగా కొమరం మధు కుమార్, పెనుగొండ మహేష్, కొండ్రు శ్రీనివాస్ లు ను ఎన్నుకున్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



**ప్రజాపక్షం/కల్లూరు:** ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పని సరిగా ప్రతి ఒక్క రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిని రూప రైతులను కోరారు. ప్రతి రైతుకు 14 నెంబర్లతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది దాని ప్రకారంగా రైతులు తమ భూముల వివరాలను ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని కేంద్ర రాష్ట్ర వ్యవసాయం పథకాల లబ్ధి సులభంగా పొందవచ్చని పీఎం కిసాన్ సాయానికి ఫార్మర్ ఐడి తప్పనిసరి అని రైతు వివరాలు ఖచ్చితంగా నమోదయి పారదర్శకత పెరుగుతుందని, రాయితీలు రుణాలు సంక్షేమ పథకాలు త్వరగా అందుతాయని ఒకే ఐడితో లబ్ధిదారునికి భవిష్యత్తు పథకాల ప్రయోజనాలు సులభంగా స్పష్టమైన గుర్తింపుతో మోసాలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఆధార్ కార్డు నెంబరు, భూమి పాస్ పుస్తకం, ఆధార్ లింక్ అయినా ఫోన్ నెంబరు తీసుకొని రైతు వేదికలలో ఉచితంగా సమీపంలోని మీసేవ కేంద్రాలు లో చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సంప్రదించాలని తెలిపారు అదేవిధంగా పంచాయతీల కార్యాలయాలలో నమోదు ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సెల్‌టవర్ నిర్మాణంపై కలెక్టర్‌ను కలిసిన సిరిపురం కెజి గ్రామ ప్రజలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల కెజి సిరిపురం గ్రామం లో అనుమతులు లేకుండా సెల్ టవర్ నివాస గృహాల మధ్య నిర్మాణం చేపట్టారు. గ్రామ ప్రజలు సెల్ టవర్ నిర్మాణానికి నిరాకరించి నిర్మాణాన్ని నిలిపివేయాలని పలుమార్లు నిరసన తెలిపారు. ఏమి పట్టినట్టుగా సెల్‌టవర్ నిర్మాణం చేపట్టారు. గ్రామస్థులు ఆగ్రహంతో సెల్‌టవర్ నిర్మాణం కోసం తీసిన గుంటలో దిగి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక ఎస్సై పుష్పాల రామారావు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి నిర్మాణ పనులను ఆపారు. అనంతరం గ్రామస్థులు ఖమ్మం కలెక్టర్ అనుదీప్‌ని కలిసి వారి గోడుని వెలుబుచ్చుకున్నారు. అనంతరం కలెక్టర్ స్థానిక తహశీల్దార్‌కి, అధికారులకు ఫోన్‌లో తక్షణమే సెల్‌టవర్ స్థలాన్ని మార్చండి అంటూ ఆదేశాలు ఇచ్చారు. గ్రామస్థులు కలెక్టర్ మాట విన్న వెంటనే చాలా ఆనందపడ్డారు. ఈ కార్యక్రమంలో కామినేని శ్రీనివాసరావు, మోరంపూడి మధు, దుప్పటి గోపి, బండ్ల అశోక్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.